# పెన్ పవర్

10 YEAR ANNIVERSARY 2014 - 2024

తెలంగాణ రౌండప్

మంగళవారం | 18 ఫిబ్రవరి 2025 | పేజీలు 8


## ఇసుక అక్రమ రవాణాపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

- ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులకు ఆదేశం
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఇసుక రీచ్‌లను తనిఖీ చేయాలని ఆదేశం
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చూడాలని సూచన

-2 లో



# మెట్రో సెకండ్ ఫేజ్‌లో.. నయా టెక్నాలజీ..

## సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం..

- మేడ్చల్, షామీర్‌పేట్ కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోబోతున్నాయి..
- బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భూగర్భ కారిడార్ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో ప్లాన్..
- 23 కిలోమీటర్ల మేర ప్యారడైజ్-మేడ్చల్ కారిడార్..
- 22కిలో మీటర్ల జేబీఎస్-శామీర్‌పేట్ ప్రతిపాదిత కారిడార్, అల్కైన్‌మెంట్‌లకు కసరత్తు పూర్తి..
- పెన్ పవర్‌కు తెలిపిన హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి..

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్, హైదరాబాద్, ఫిబ్రవరి 17:** హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్‌లో సరికొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోబోతున్నాయి. బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భూగర్భ కారిడార్ నిర్మాణానికి హైదరాబాద్ మెట్రో ప్లాన్ చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో హైదరాబాద్ మెట్రో సారథ్యంలో సాంకేతిక నిపుణులు, అధికారులు కొత్త మెట్రో మార్గాలను రూపొందించేందుకు కసరత్తు ప్రారంభించారు.. 23 కిలోమీటర్ల మేర ప్యారడైజ్%-% మేడ్చల్ కారిడార్.. 22కిలో మీటర్లు జేబీఎస్%-% శామీర్‌పేట్ ప్రతిపాదిత కారిడార్, అల్కైన్‌మెంట్లకు సంబంధించిన కసరత్తు పూర్తి చేశారు.. జేబీఎస్ నుండి మేడ్చల్, జేబీఎస్ నుండి శామీర్ పేట్ మెట్రో కారిడార్‌లకు డీపీఆర్‌ల తయారీకై అవసరమైన వివిధ రకాల సర్వే పనులు జోరుగా సాగుతున్నాయని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పెన్ పవర్‌కి తెలిపారు..

-2లో





## పార్కులు ప్రభుత్వ భూములు కాపాడండి..

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..**
**అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదును అందజేసిన ఆకుల సతీష్..**

- నన్ కన్వెన్షన్‌లో నాలుగు పార్కులు, రోడ్లు ప్రజాప్రయోజనాలు ఆక్రమించి ప్రహరీగోడ..
- రూ.150 కోట్లు విలువైన 6-7 ఎకరాల ప్రజా పయోజనాలు కబ్జాపై సతీష్ ఫిర్యాదు..
- మరోవైపు మల్లంపేట్ శివారు సర్వే నెం.170లో ఓ వ్యక్తి 12-20 ఎకరాల కబ్జాపై ప్రజావాణి ఫిర్యాదు..
- అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా..! స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం అంటూ ఆరోపణలు..

-3లో

## నలుగురిపైనే అందరి దృష్టి...!

### ఈ సారైనా కులగణనలో పాల్గొంటారా?

- సర్వే అధికారులకు వివరాలు అందిస్తారా?
- తొలిదఫాలో పాల్గొనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్, డీకే అరుణ
- మిగతా చోట్ల పలువురు లీడర్ల కూడా వివరాలివ్వలే
- ఈ నెల 28 వరకు మరో మారు ప్రత్యేకంగా సర్వే




-2 లో

## బండి సంజయ్‌కి మహేశ్ కుమార్ గౌడ్ సవాల్

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం బిల్లును తెస్తామన్న టీపీసీసీ చీఫ్
- బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టే దమ్ము ఉందా? అని ప్రశ్న
- దేశవ్యాప్త కులగణనకు మోదీని అడిగే సత్తా ఉందా? అని నిలదీత



-2 లో

# మెట్రో సెకండ్ ఫేజ్‌లో.. నయా టెక్నాలజీ..

## 80-100 అడుగుల లోతులో భూ సామర్థ్య నమూనాల సేకరణ..

సాధారణంగా ప్రతి అర కిలోమీటర్‌కు ఒక బోర్ హోల్ చొప్పున భూసామర్థ్య పరీక్షల నమూనాలు సేకరిస్తారు.. ఒక్కో బోర్ హోల్‌ను ఏభై నుండి వంద అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ వేసి, ఏ స్థాయిలో భూమి గట్టి తనంగానీ లేదా రాతి పొరలు తగులుతాయో పరిశీలిస్తామని మెట్రో ఎండీ పేర్కొన్నారు.. ఇప్పటికే హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో కొన్ని భూ సామర్థ్య అధ్యయనాలు చేపట్టడం వల్ల, ఇప్పుడు మెట్రో సంస్థ జేబీఎస్, మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జేబీఎస్ శామీర్‌పేట్ మార్గంలో 19 చోట్ల ఈ భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి తెలిపారు. వీటిలో మేడ్చల్ మార్గంలో 14 చోట్ల, శామీర్‌పేట్ మార్గంలో 11 చోట్ల ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయని ఈ నెలాఖరులోగా మొత్తం అన్నిచోట్ల ఈ పరీక్షలు పూర్తవుతాయని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రయాణించే విధంగా ఈ మెట్రో కారిడార్లను నిర్మించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈ అధ్యయనాలు అన్నీ పూర్తి చేసి మార్చి నెలాఖరుకు శంషాబాద్ విమానాశ్రయం, ఫ్యూచర్ సిటీ మార్గంతో సహా ఈ మూడు మెట్రో మార్గాల డీపీఆర్ లను సంపూర్ణ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి సమర్పిస్తామని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత డీపీఆర్ లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడిరచారు.



## భవిష్యత్తు అంచనాల దృష్ట్యా సర్వేలు..

డీపీఆర్‌ల తయారీకి ముఖ్యంగా మూడు రకాల్కెన అధ్యయనాలు అవసరమని మెట్రో అధికారులు గుర్తించారు.. ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు (జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం (ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్). ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్‌లలో ప్రస్తుతం జరుగుతున్న రోజువారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్‌లో జరగబోయే రోజువారీ ప్రయాణాల అంచనాలపై సమగ్ర సర్వే నిర్వహించారు.. జంక్షన్ల వద్ద ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు తీసుకునే మలుపులు, పాదచార

ప్రయాణికుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు.. వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు..

## భూ సామర్థ్య పరీక్షల నిర్వహణ..

ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావిత అధ్యయనంలో ప్రస్తుతం ఈ మార్గాలలో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న ధూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతుజీవాల జీవ వైవిధ్యం, జీవనాధారభ్రుతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయవలసి ఉంటుందని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.. ఇక భూసామర్థ్య పరీక్షల్లో ఈ మార్గాలలో ఉండే వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.. భూగర్భంలో నిక్షిప్తమైన నీటి లెవెల్స్ అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తారు..

## బండి సంజయ్‌కి మహేశ్ కుమార్ గౌడ్ సవాల్

**హైదరాబాద్ పెన్ పవర్:**బీసీ నేతను ముఖ్యమంత్రిని చేసే దమ్ము బీజేపీకి ఉందా? అని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లును తీసుకువస్తామని అన్నారు. ఈ బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో పెట్టించే దమ్ము ఉందా? అని నిలదీశారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఒప్పించే దమ్ముందా? అని బండి సంజయ్‌కి సవాల్ విసిరారు. దేశవ్యాప్త కులగణనకు మోదీని అడిగే సత్తా ఉందా? అని ప్రశ్నించారు. దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా భవిష్యత్తు అంతా బీసీలదే అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తాము అధికారంలోకి వస్తే బీసీ నేతను ముఖ్యమంత్రిని చేస్తాయా? అని నిలదీశారు. బీసీ నేతను ముఖ్యమంత్రిని చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు.

## నలుగురిపైనే అందరి దృష్టి !..ఈ సారైనా కులగణనలో పాల్గొంటారా?

**హైదరాబాద్ పెన్ పవర్:**కులగణనలో పాల్గొనని 3,56,323 కుటుంబాలు, 16 లక్షల మంది కోసం ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసింది. ఆ నంబర్ కు కాల్ చేస్తే ఎన్యూమరేటర్లు వచ్చి వివరాలు స్వీకరిస్తారని తెలిపింది. దీంతోపాటు ఆన్లైన్ లో నమోదు చేసుకునేందుకు వెబ్ సైట్ కూడా ఏర్పాటు చేసింది. కులగణన సర్వేలో ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణతో పాటు పలువురు పాల్గొనలేదు. వీళ్లు ఈ సారైనా తమ వివరాలు ఇస్తారా..? లేదా..? అన్నది ఆసక్తికరంగా మారింది. వీళ్లందరిలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్, డీకే అరుణపైనే అందరి దృష్టి నెలకొంది. కులగణనపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సమయంలో ఎన్యూమరేటర్లకు వివరాలు ఇవ్వొద్దని అప్పుడు రేవంత్ రెడ్డి చెప్పారని, తాము అదే అవలంబించామని సమర్థించుకున్నారు.

దీనికి కౌంటర్ గా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సర్వేలో పాల్గొనని సభ్యులకు అసెంబ్లీలో

ఈ అంశంపై మాట్లాడే అర్హత లేదన్నారు. దీనిపై వాడి వేడి చర్చ జరిగిన తర్వాత సాక్షాత్తూ ముఖ్యమంత్రే సర్వేలో పాల్గొనని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వివరాలను ప్రకటించారు. భూముల వివరాలు అడిగినందుకే భయపడి.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు సర్వేలో పాల్గొనలేదని ఎద్దేవా చేశారు. ఈ కులగణన సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా 3.54 కోట్ల మంది పాల్గొన్నారని, చాలా మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు భూముల వివరాలు ఇచ్చారని.. కానీ కొందరు మాత్రమే ఇవ్వలేదని తెలిపారు. దీనిపై బీసీ సంఘాల నుంచి కూడ అభ్యంతరాలు తలెత్తడంతో మరో అవకాశం ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది ఈ మేరకు నిన్నటి నుంచి సర్వేను ప్రారంభించింది. ఇప్పుడైనా ఈ నేతలు పాల్గొంటారా..? లేదా..? అన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇసుక అక్రమ రవాణాపై రేవంత్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇసుక అక్రమ రవాణాపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ఇసుక రీచ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టకుండా చూడాలని సూచించారు. ఓవర్ లోడ్, అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడులు చేపట్టాలన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే.



# పార్కులు ప్రభుత్వ భూములు కాపాడండి

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు..
## అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదును అందజేసిన

- నన్ కన్వెన్షన్‌లో నాలుగు పార్కులు, రోడ్లు ప్రజాప్రయోజనాలు ఆక్రమించి ప్రహరీగోడ..
- రూ.150 కోట్లు విలువైన 6-7 ఎకరాల ప్రజా పయోజనాలు కబ్జాపై సతీష్ ఫిర్యాదు..
- మరోవైపు మల్లంపేట్ శివారు సర్వే నెం.170లో ఓ వ్యక్తి 12-20 ఎకరాల కబ్జాపై ప్రజావాణి ఫిర్యాదు..
- అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా..! స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం అంటూ ఆరోపణలు..



**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 17:** నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లో సర్వే నెంబర్ 153, 154, 155, 162 ప్రగతి నగర్‌లో "నన్ కన్వెన్షన్ సెంటర్‌లో" నాలుగు పార్కులు, రోడ్లు, ప్రజా ప్రయోజనాల స్థలం ఆక్రమించి, అక్రమంగా కాంపౌండ్ వాల్ నిర్మాణం..! మల్లంపేట్ గ్రామం సర్వే నెంబర్ 170 ఓ వ్యక్తి 12 ఎకరాలు కబ్జాచేసి, ప్లాట్లుగా విభజించి, అమాయక ప్రజలకు అమ్మకం, అక్రమ నిర్మాణాలపై అడిషనల్ కలెక్టర్‌కి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు సతీష్ తెలిపారు.. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ సర్వే నెంబర్ 153, 154, 155, 162లోని అప్రువల్ లేఅవుట్‌లో ప్రజా ప్రయోజనాల స్థలం నాలుగు పార్కులు, ఒక ఇమ్యూనిటీ హాల్ స్థలం, 20 వరకు రోడ్లను ఓ బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేసి, చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడమే గాక, ఆక్రమిత ప్రజాప్రయోజనాల స్థలాల్లో భారీ ఫంక్షన్ హాల్ నిర్మించుకొని దర్జాగా అనుభవిస్తున్నాడని సతీష్ ఆరోపిం చారు.. ప్రస్తుతం హెచ్‌ఎండిఏ కి ఈ మొత్తాన్ని ఒక లేఔట్‌గా గుర్తించ వలసిందిగా దరఖాస్తు చేసుకు న్నారని అన్నారు.. కబ్జాచేసిన స్థలం మొత్తం 6 నుండి 7 ఎకరాలు సుమారు రూ.150 కోట్లు ఉంటుం దని అన్నారు.. ప్రజాప్రయోజనాల స్థలాలు కబ్జా చేయడమే కాక, అనుమ తులు లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మించి వ్యాపారం చేస్తున్నాడని పేర్కొన్నారు..పరిసర కాలనీల ప్రజలు వెళ్ళకుండా చుట్టూ కాం పౌండ్ వాల్ నిర్మించుకొని పార్క్ స్థలంలోకి కబ్జా పెట్టుకుని ఎన్‌ఏఎన్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలకు చెందాల్సిన ప్రజాప్రయో జనాలను స్వాధీన పరచుకుని అభివృద్ధి చేయాలని ఆకుల సతీష్ అడిషనల్ కలెక్టర్‌ను కోరారు..










అదేవిధంగా లక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ పక్కనే భారీ భవన నిర్మాణం, హై స్కూల్ వద్ద మరొక భవనం కూడా సర్వేనెంబర్ 170 వస్తున్నా..! ప్రవేట్ సర్వే నెంబర్‌తో అనుమతులు తీసుకోవడంపై, తక్షణమే చర్యలు తీసుకోవాలని, జీవో 58,59 రెగ్యులరైజ్ అయిన వారిని వదిలేసి మిగిలిన ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా అవసరాలకి వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ,శ్రీనివాస్ గౌడ్, పాండు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు..






### విద్యుత్ మీటర్లు.. ఇంటి నెంబర్‌లు..

170 కబ్జాదారుడు ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను, అమాయక ప్రజలకి అంట కట్టడమే కాకుండా అక్రమంగా నిర్మించిన ఇంట్లకి తప్పుడు ఇంటి నెంబర్‌లు సృష్టించి, ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలకి విద్యుత్ శాఖ ఏఈ డిఈ సాకారంతో మీటర్లు కరెంటు పోల్స్ రావడం బహు విడ్డూరం అంటూ ఆరోపించారు.. అంతేకాకుండా ఈ ప్రభుత్వ స్థలంలో అధికారులతో ఒప్పందం కుదుర్చుకుని సంబంధిత కబ్జాదారుడు ప్రస్తుతం దాదాపు 10 నిర్మాణాలు కొనసాగుతున్నా..! తహశీల్దార్ చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.. రెవెన్యూ అధికారుల సహకారంపై అడిషనల్ కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు..



### మల్లంపేట్ సర్వే నెం.170 రియల్ దందా..

దుండిగల్ గండిమైసమ్మ మండలం మల్లంపేట్ సర్వే నెంబర్ 170లో 44 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని..! సంబంధిత ప్రభుత్వ భూమిలో గత తొమ్మిది సంవత్సరాలుగా ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్‌లు వెలిశాయని, అక్రమ కట్టడాలను హైడ్రా కొంతవరకు కూల్చివేసినప్పటికీ గత మూడు సంవత్సరాలుగా సర్వే నెంబర్ 170 కొత్తచెరువు ఆనుకొని దాదాపు 12 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని చిన్న చిన్న ప్లాట్లుగా చేసి పేద ప్రజలకు అంటగట్టడమే, కాకుండా ప్రస్తుతం కూడా ఈ ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు యధావిధిగా కొనసాగుతున్నట్లు ఆరోపించారు.. రెవెన్యూ అధికారుల అండతో చర్యలు తీసుకోక పోవడానికి ప్రధాన కారణం..! సంబంధిత కబ్జాదారుడు ఓ రెవెన్యూ అధికారితో గత ఏడాదిగా ఒప్పందం కుదుర్చుకుని, మరింత రెచ్చిపోతూ..! 12 ఎకరాల నుండి 20 ఎకరాల కబ్జాదారునిగా ఎదిగాడని సతీష్ ఆరోపించారు.. ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడుతూ, ప్లాట్లుగా వేసి ప్రజలకు అమ్ముతూ ప్రజా సంపద దోపిడిపై అధికారుల అలసత్వం వహిస్తున్నారని ఆకుల సతీష్ తెలిపారు.. గత మూడేళ్ళుగా మల్లంపేట గ్రామానికి మంచినీరు సప్లై చేసే బోర్ వెల్, డంపింగ్ యార్డ్ స్థలాన్ని, కత్వ చెరువుని కబ్జా చేసి దర్జాగా ఫెన్సింగ్ వేసుకొని తన స్వాధీనంలోకి తీసుకున్నాడని.. మరోవైపు నాలాను కూడా కబ్జా చసినప్పటికీ.. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తూ ఉండిపోయారని అన్నారు..

## వివాహ వేడుకలో పూలదండలు, ఉంగరాలు మార్చుకున్న కేసీఆర్ దంపతులు



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దంపతులు ఓ వివాహ వేడుకలో ఒకరికొకరు పూలదండలు మార్చుకుని, ఉంగరాలు తొడుక్కున్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన నమస్తే తెలంగాణ సంపాదకులు తిగుళ్ల కృష్ణమూర్తి కుమారుడి వివాహ విందుకు కేసీఆర్, శోభ దంపతులు హాజరయ్యారు. ఈ వేడుకకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వధూవరులను ఆశీర్వదించారు. ఈ రోజే కేసీఆర్ జన్మదినం కావడంతో పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, వివాహ వేడుక నిర్వాహకులు వేదిక మీదకు పూలదండలు, ఉంగరాలు తీసుకువచ్చారు. కేసీఆర్, శోభ దంపతులను దండలు, ఉంగరాలు మార్చుకోవాలని కోరారు. దీంతో కేసీఆర్, శోభ దంపతులు ఒకరికొకరు దండలు మార్చుకొని, ఉంగరాలు తొడుక్కున్నారు.

## టీటీడీ చైర్మన్‌కే షాకిచ్చిన కేటుగాడు.. విఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్ల పేరుతో మోసం



హైదరాబాద్ పెన్ పవర్: తిరుమల శ్రీవారి భక్తులకు అలెర్ట్ అందుతోంది. విఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్ల పేరుతో ఘరానా మోసం వెలుగు చూసింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫోటో వాట్సప్ డీపీగా పెట్టి ఓ కేటుగాడు.. భక్తుల నుంచి అందినకాడికి డబ్బు దోచుకున్నాడు. ముఖ్యంగా ఎన్ఆర్ఐ భక్తులను టార్గెట్ చేసుకొని మోసాలకు పాల్పడ్డాడు. విఐపీ బ్రేక్ దర్శనం, సుప్రభాత సేవ, ఆర్జిత సేవ టికెట్లు అందుబాటులో ఉన్నాయని.. కావలసిన వారు తనను సంప్రదించాలని తిరుమల సమాచారం వాట్సప్ గ్రూప్‌లో పోస్టులు పెట్టేవాడు. ప్రొఫైల్ పిక్‌గా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫోటో ఉండటంతో.. ప్రకటన నిజమని నమ్మి ఫోన్లు చేసిన భక్తులను నిండా ముంచేవాడు. ఈ విషయాన్ని మోసపోయిన భక్తులు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లగా.. కేటుగాడి బాగోతం బయటపడింది. ఫోన్ నంబర్ ఆధారంగా మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని హైదరాబాద్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జావెద్ ఖాన్‌గా గుర్తించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, భక్తులను మోసగించిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని విజిలెన్స్ %౦% పోలీసు అధికారులను టీటీడీ చైర్మన్ ఆదేశించారు.

# చిలుకూరు ఆలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి నిందితుడికి పోలీసు కస్టడీ

హైదరాబాద్ పెన్ పవర్: చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి కస్టడీకి కోర్టు అనుమతించింది. వీరరాఘవరెడ్డిని మూడ్రోజుల కస్టడీకి అనుమతించింది. నిందితుడిని ఏడు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని రాజేంద్ర నగర్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. పోలీసులు రేపటి నుండి మూడు రోజుల పాటు అతనిని కస్టడీకి తీసుకోనున్నారు. ఇటీవల, చిలుకూరు బాలాజీ ఆలయం అర్చకుడు రంగరాజన్‌పై వీరరాఘవరెడ్డి దాడి చేసినట్లు వార్తలు రావడం తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. రంగరాజన్‌పై దాడిని అన్ని రాజకీయ పార్టీలు ఖండించాయి. రంగరాజన్‌ను పలువురు రాజకీయ నాయకులు, వివిధ సంఘాల నేతలు కలిసి సంఘీభావం తెలిపారు.



# కేసీఆర్ పుట్టినరోజు... ఎర్రవెల్లిలో గ్రామస్తుల యాగం




హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖరరావు జన్మదినం సందర్భంగా ఎర్రవెల్లిలో గ్రామస్తులు యాగం నిర్వహించారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి, యాగం నిర్వహించారు. ఈ యాగంలో కేసీఆర్ దంపతులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**కవిత ప్రత్యేక పూజలు**

బీఆర్ఎస్ శ్రేణులు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వేదికలు ఏర్పాటు చేసి కేకులు కట్ చేస్తున్నారు, మిఠాయిలు పంచుతున్నారు. కొంతమంది సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తన తండ్రి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఎమ్మెల్సీ కవిత బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో గల వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన తండ్రి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ పూజలు చేశారు.

**కేసీఆర్ ఫ్లెక్సీలు తొలగించారంటూ బీఆర్ఎస్ ధర్నా**

కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగించారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరసన చేపట్టాయి. ఆర్టీసీ క్రాస్ రోడ్డుతో పాటు పలుచోట్ల ఏర్పాటు చేసిన పుట్టినరోజు శుభాకాంక్షలకు సంబంధించిన ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ధర్నా చేపట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు పాటించాలి

**జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి**

జగిత్యాల, పెన్ పవర్: జిల్లాలోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ నిబంధనలు పాటించాలని జగిత్యాల జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి సూచించారు. సోమవారం జిల్లాలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ ను మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం నిబంధనలు పాటించాలని, రిజిస్ట్రేషన్ నమోదు చేయించుకున్నప్పుడు ఇచ్చిన వైద్యుల మరియు సహాయ సిబ్బంది యొక్క పేర్లు మాత్రమే ఉండాలని ఎవరైనా సిబ్బంది వెళ్ళిపోయినా కొత్తవారు వచ్చిన మళ్లీ నమోదు చేయించుకున్న తర్వాతే వారి సేవలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్స్ లో అందిస్తున్న సేవలకు టారిఫ్ బోర్డ్ ను తెలిపే విధంగా హాల్లో ప్రదర్శించవలెనని సూచించారు. అర్హత లేని వైద్యులను నియమించుకోరాదని తెలంగాణ మెడికల్ బోర్డు కౌన్సిల్లో తప్పనిసరిగా నమోదయి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యా బోధకులు కటుకం భూమేశ్వర్, తరాల శంకర్ ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం ,హెల్త్ సూపర్వైజర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు



# తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ ఓబీసీ నేత కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిలో ఎలాంటి మార్పు ఉండదని, కానీ భవిష్యత్తులో తమ పార్టీ నుండి బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతారని ఏఐసీసీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు అజయ్ సింగ్ యాదవ్ అన్నారు. రాబోయే నాలుగేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని స్పష్టం చేశారు. ఈరోజు ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ, తెలంగాణకు మున్ముందు బీసీ నాయకుడు ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. భవిష్యత్తు అంతా బీసీలదే అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశంలోని అన్ని రాష్ట్రాలకు కనువిప్పు కలిగిస్తుందని ఆయన అన్నారు. బీసీలకు ఇదొక గేమ్ ఛేంజర్ అని వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో ఓబీసీలు లేరని, అన్ని పోస్టుల్లో కూడా అగ్ర కులాల వారే ఉన్నారని అన్నారు. దేశంలో 1 శాతం ఉన్న అగ్రకులాల చేతుల్లో 40 శాతం దేశ సంపద ఉందని ఆయన విమర్శించారు. అన్నింటా అన్ని కులాలకు సమ ప్రాధాన్యం దక్కాలని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం త్వరలో తీసుకురానున్న బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 46 శాతం, మైనార్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలహీనుల వైపు నిలబడుతుందని ఆయన అన్నారు. తాము ఎప్పుడూ ఓబీసీలకు వ్యతిరేకం కాదని ఆయన అన్నారు.




# ఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట ఘటన...
# రైల్వే శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:**దేశ రాజధాని న్యూఢిల్లీలో రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లేందుకు ప్రయాణికులు పోటెత్తారు. ఈ నేపథ్యంలో జరిగిన తొక్కిసలాటలో పదుల సంఖ్యలో మృతి చెందారు. రైలు వద్ద, ప్లాట్‌ఫాంపై గందరగోళంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ పరిణామాల నేపథ్యంలో రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది.రైల్వే స్టేషన్‌లలో రద్దీని నియంత్రించే ఉద్దేశంలో భాగంగా ప్రత్యేక హోల్డింగ్ జోన్లను ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమైనట్లుగా సమాచారం. దేశవ్యాప్తంగా అత్యధిక రద్దీ కలిగి ఉండే 60 రైల్వే స్టేషన్‌లలో శాశ్వత హోల్డింగ్ ప్రాంతాలను నిర్మించాలని కేంద్ర రైల్వే శాఖ నిర్ణయించినట్లుగా సమాచారం.రైల్వే స్టేషన్‌లలో రద్దీ నియంత్రణ, విపత్తు నిర్వహణ కోసం కృత్రిమ మేధ (ఏఐ)ని వినియోగించుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. ఈ మేరకు స్థానిక అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రయాణికులు హోల్డింగ్ ప్రాంతాల వద్దకు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకోసం గుర్తులు, ఆయా హోల్డింగ్ ప్రాంతాలకు వెళ్లడానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయనున్నారు.




# ఈనెల 26న డా. నక్కరాజు 24 గంటల "గాన స్వరాభిషేకం"

**పోస్టర్ ఆవిష్కరించిన ఆధ్యాత్మిక ప్రముఖులు**

**జగిత్యాల, పెన్ పవర్:**పట్టణంలోని వాణి నగర్ లో గల జవ్వాజి పుల్లయ్య గారి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం (ధర్మశాల) లో ఈ నెల 26న డా.నక్క రాజు నిర్వహించనున్న 24 గంటల గాన స్వరాభిషేకం వాల్ పోస్టర్ ను ఆధ్యాత్మిక ప్రముఖులు సోమవారం ఆవిష్కరించారు. గత 13 వసంతాలుగా నక్క రాజు నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక గాన స్వరాభిషేకం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 7వ సారి 24 గంటల నిర్విరామ గాన స్వరాభిషేకం కార్యక్రమాన్ని వాణి నగర్ – జగిత్యాలలోని జవ్వాజి పుల్లయ్య గారి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం ధర్మశాల లో నిర్వహించే ప్రయత్నం చేయడం ఆనందంగా ఉందని ఆలయ కమిటీ పర్యవేక్షకులు జవ్వాజి సందీప్ అన్నారు. భగవత్ బంధువులు అందరూ హాజరై ఈ 24 గంటల కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆధ్యాత్మిక ప్రముఖులు మాట్లాడుతూ నక్క రాజు చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను, ఆయన పొందిన అవార్డులు, డాక్టరేట్ పట్టాలను అభివర్ణిస్తూ అభినందించారు. ఈ నెల 26 బుధవారం ఉదయం 8-00 గంటల నుండి 27 గురువారం ఉదయం 8-00 గంటల వరకు ఈ "మహా సంకల్ప దృఢ నిశ్చల శివ నామ గాన స్వరాభిషేకం" జరుగు తుందని నక్క రాజు తెలియ జేశారు. భగవత్ బంధువులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, కళాకారులు, గాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి సహకరిస్తూ విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పర్యవేక్షకులు జవ్వాజి సందీప్ కుమార్, విశ్వ హిందూ పరిషత్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు బోయిని పద్మాకర్, అయ్యప్ప స్వామి భజన మండలి సేవా ట్రస్ట్ అధ్యక్షులు నీలం దశరథ రెడ్డి, ఉపాధ్యక్షులు మార కైలాసం, జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ జాతీయ అధ్యక్షులు అయిల్నేని శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షులు నక్క గంగారాం, సీనియర్ పాత్రికేయులు, ఐజెయు జాతీయ ప్రెస్ కౌన్సిల్ మాజీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ ల సంఘం అధ్యక్షులు గడ్డం రమేష్, ఆధ్యాత్మిక ప్రముఖులు అవారి లక్ష్మీకాంతం, అవారి రాఘవేంద్ర, బుగ్గారం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దూడ జీవన్, రఘు, త్రిశూల్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు నందయ్య, డాక్టర్ మారంపల్లి ఆనంద్, బానుక మహేష్, మానవ హక్కుల సంఘం సభ్యులు రాథోడ్, ప్రభాకర్, భరత్, కళాకారులు గడ్డం రమేష్, కాసర్ల భీమన్న, రామారావు, అంగరి తార కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కు బర్త్ డే విషెస్ తెలిపిన పవన్ కల్యాణ్

- కేసీఆర్ పుట్టినరోజు
- బీఆర్ఎస్ అధినేతపై విషెస్ వెల్లువ
- మరెన్నో సంవత్సరాల పాటు ప్రజాసేవలో గడపాలన్న పవన్ కల్యాణ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ (ఫిబ్రవరి 17) పుట్టినరోజు జరుపుకుంటు న్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విషెస్ తెలిపారు. "తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికి హృదయపూర్వక జన్మ దిన శుభాకాంక్షలు. ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, నిరంతర శక్తితో మరెన్నో సంవత్సరాల పాటు ప్రజా సేవలో గడపాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఢిల్లీ కొత్త సీఎం ప్రమాణం స్వీకారం చేసేది ఎప్పుడంటే...!

**గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఢిల్లీ సీఎం ప్రమాణం**

**మోదీ, అమిత్ షా, కేంద్ర మంత్రుల సమక్షంలో రామ్‌లీలా మైదానంలో వేడుక**

**మంత్రివర్గమూ అదే రోజు ప్రమాణం చేస్తుందని వార్తలు**

**ఢిల్లీ సీఎం రేసులో ముందు వరుసలో ఉన్న పర్వేశ్ వర్మ, రేఖా గుప్తా, ఆశీష్ సూద్**



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ కొత్త సీఎం ప్రమాణ స్వీకార ముహూర్తం ఖరారైనట్టు తెలిసింది. గురువారం సాయంత్రం 4.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రుల సమక్షంలో రామ్‌లీలా మైదానంలో ఈ వేడుక జరగనుందని సమాచారం. మంత్రివర్గమూ అదే రోజు ప్రమాణం చేస్తుందని వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ సీఎం రేసులో పర్వేశ్ వర్మ, రేఖా గుప్తా, ఆశీష్ సూద్ ముందు వరుసలో ఉన్నారు. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాషాయ పార్టీ ఏకంగా 48 సీట్లు గెలుచుకున్న విషయం తెలిసిందే. అటు అధికార ఆప్ కేవలం 22 సీట్లకే పరిమితమైంది. దాంతో 27 ఏళ్ల తర్వాత బీజేపీ పార్టీ ఢిల్లీలో తిరిగి అధికారం చేపట్టబోతోంది.

# మస్తాన్ సాయి వివాదంలో కీలక పరిణామం.. ఏపీ గవర్నర్ కు లావణ్య లేఖ




**హైదరాబాద్ పెన్ పవర్:**మస్తాన్ సాయి, లావణ్యల మధ్య వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ కు లావణ్య తరపు న్యాయవాది నాగూర్ బాబు లేఖ రాశారు. మస్తాన్ సాయి వల్ల మస్తాన్ దర్గాకు అపవిత్రత కలుగుతోందని లేఖలో పేర్కొన్నారు. గుంటూరులోని మస్తాన్ దర్గా ధర్మకర్తలుగా మస్తాన్ సాయి కుటుంబ సభ్యులను తొలగించాలని లేఖలో కోరారు. ఈ లేఖను చీఫ్ సెక్రటరీ, గుంటూరు జిల్లా కలెక్టర్, మైనార్టీ సంక్షేమ శాఖకు పంపించారు. సినీ హీరో రాజ్ తరుణ్, లావణ్యల మధ్య నెలకొన్న వివాదం సినీ పరిశ్రమలో దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మస్తాన్ సాయి నిందితుడిగా ఉన్నాడు. ఇప్పటికే మస్తాన్ సాయిపై మహిళల న్యూడ్ ఫొటోలు తీయడం, అత్యాచారం, డ్రగ్స్ ఇలా పలు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మస్తాన్ సాయి హైదరాబాద్ నార్సింగి పోలీసుల కస్టడీలో ఉన్నాడు.

# కేసీఆర్ కు శుభాకాంక్షలు తెలిపిన రేవంత్ రెడ్డి

### 71వ పుట్టినరోజు జరుపుకుంటున్న కేసీఆర్ కేసీఆర్ కు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నానన్న రేవంత్

### రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు 71వ పుట్టినరోజును జరుపుకుంటున్నారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మరోవైపు కేసీఆర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'గజ్వేల్ నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు' అని ట్వీట్ చేశారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నట్టు సీఎం తెలిపారు.

# కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు



**హైదరాబాద్: పెన్ పవర్:**సిద్దిపేట జిల్లా పార్లమెంటు ఎన్నికల్లో మూడో సారి నరేంద్ర మోదీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని ప్రతిపక్షాల తీరు పార్లమెంటులో విచిత్రంగా ఉందని ప్రజానీకం అంతా ఒకటే భావనతో అన్నారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా, గజ్వేల్ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఆర్థికంగా, బలంగా ఉండాలన్నా, ప్రపంచంలో దేశం సగౌరవంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలనేది ప్రజలకు తెలుసునని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం వస్తే.. బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయన్నారు.ఇప్పుడు తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు మోదీని ఆశీర్వదించే విధంగా కనిపిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయులకు అండగా కొట్లాడిన పార్టీ బీజేపీ అని, టీచర్ల విషయంలో, మధ్యతరగతి వారి విషయంలో బీజేపీ కృషిచేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య దేశంలో నే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాండవిస్తోందని, ప్రపంచం లో 11 వ ఆర్థిక వ్యవస్థలో ఉన్న భారత్ మోదీ కృషితో 5 వ స్థానానికి వచ్చిందన్నారు. నిరుద్యోగ సమస్యను సంపూర్ణంగా నిర్మూలించే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్లో రూ. 4 లక్షల కోట్లు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచాన్నే శాసించే అమెరికా అధ్యక్షుడు, అమెరికాలో మోదీని సన్మానించిన విషయం చూసామన్నారు. కేసీఆర్ పాలనను ప్రజలు అసాహ్యించుకోడానికి 9 సంవత్సరాలు పడితే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు అసాహ్యించుకోడానికి 9 నెలలు పట్టిందన్నారు.కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు.కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారని, కాంగ్రెస్ పార్టీని కానీ కేసీఆర్‌ను కానీ ప్రజలు నమ్మే విధంగా లేరని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందే కేసీఆర్ అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ నిలదీయడం ఎంటన్నారు. కాళేశ్వరంపై అధికారులను ప్రశ్నిస్తే కేసీఆర్ చెప్పినట్లే చేసామని చెబుతున్నారు. కేంద్రంలో 70 మందికి పైగా మంత్రులు ఉంటే.. అందులో 30 మందికి పైగా బీసీలే ఉన్నారని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.

# సీఎం తీరును చూస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితి..?



**కరీంనగర్: పెన్ పవర్:**ముఖ్యమంత్రిగా ఉంటూ ఐఏఎస్ లను ఒక్క తప్పు చేయాలని అంటారా అవినీతి చేయొద్దు. తప్పులు చేయకుండా చూడాల్సిన ముఖ్యమంత్రే దిగజారి మాట్లాడతారా. కొందరు మంత్రులు ప్రతి పనికి 15 శాతం కమిషన్ దండుకుంటున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.

రాష్ట్ర కేబినెట్ మంత్రుల్లో, కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య చీలిక వచ్చింది. కుల గణనతో కాంగ్రెస్ కొరివితో తలగొక్కోంటోంది. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి బిల్లు పంపతామంటే ఆమోదించడానికి మేమేమైనా ఎడ్డోళ్లమా? ముస్లింలను బీసీ జాబితా నుండి తొలగించకుంటే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు. ముస్లింలను తొలగించి బీసీ జాబితా పంపితే కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత మాదే. కాంగ్రెస్ అంటేనే బాకీల సర్కార్. నిరుద్యోగులకు 56 వేల నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాల బాకీ, ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు బాకీ, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి స్కూటీ బాకీ, ప్రతి టీచర్లుసహా ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి 4 డీఏలు బాకీ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రెండో పీఆర్సీ బాకీ, ప్రతి విద్యార్థికి, కాలేజీ యాజమాన్యానికి ఫీజు రీయంబర్స్ మెంట్ బాకీ, ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఓల్డ్ పెన్షన్ స్కీం బాకీ. జీపీఎఫ్ లో దాచుకున్న డబ్బులు కూడా బాకీ, మేధావులారా. బాకీల సర్కార్ ను బండకేసి బాదండని అన్నారు.

మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ గెలవబోతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత తెలంగాణలో అధికారంలోకి వచ్చేదాకా ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేది బీజేపీదే. బీఆర్ఎస్ పనైపోయింది అందుకే అభ్యర్థిని కూడా నిలబెట్టలేక పోయింది. కాంగ్రెస్ తో కుమ్మక్కై బీజేపీని ఓడించాలని బీఆర్ఎస్ చూస్తోంది. క్రైస్తవుల్లో చాలా మంది ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకుంటూ ఎస్సీలను మోసం చేస్తున్నారు. బీసీల్లో ముస్లింలను చేర్చి బీసీలను మోసం చేస్తున్నారు. ఇంత జరుగుతుంటే సంఘాలు ఎందుకు స్పందించడం లేదు? ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ముకాయడమే కుల సంఘాల పనా. ఇప్పటికైనా స్పందించండి. మేధావులారా కాంగ్రెస్ ను ఓడించండి బీజేపిని గెలిపించండని అన్నారు.

# మండలంలో జిల్లా పశువైద్య అధికారుల తనిఖీ,సమీక్ష సమావేశం.

**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:**జిల్లాలోని మహాదేవ్‌పూర్ మండలంలో జరుగుతున్న 21వ పశుగణన మరియు ఇతర ముఖ్యమైన జంతు సంరక్షణ విభాగపు కార్యకలాపాలను సమీక్షించేందుకు జిల్లా పశు సంవర్ధక మరియు పశువైద్యాధికారి డా. అనోడా కుమారస్వామి, జిల్లా నోడల్ అధికారి డా. జి. వెంకన్న పుష్కపల్లి, మజీద్‌పల్లి, కాలేశ్వరం, మెట్‌పల్లి, సురారం గ్రామాలను సందర్శించారు.

కాళేశ్వరం గ్రామంలో ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌కు శాశ్వత భవనం సదుపాయం గురించి చర్చించేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శితో కూలంకషంగా చర్చించారు. ఈ కేంద్రము నిర్మాణం వల్ల పశువైద్య సేవల ప్రాప్తి మెరుగుపడటంతో పాటు పశువుల ఆరోగ్య సంరక్షణకు మరింత సహాయపడుతుందని వివరించారు. సురారం గ్రామంలోని సబ్‌సెంటర్ ఏ హెచ్ ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది గైర్హాజరు గురించి వాకాబు చేశారు.దమహాదేవ్‌పూర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మండలంలోని పశువైద్య సిబ్బందితో కలిసి పలు అంశాలను సమీక్షించారు. రికార్డుల తనిఖీ, వివిధ పథకాలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ పరిశీలించారు. 21వ పశుగణన పురోగతి, డేటా ఖచ్చితంగా మరియు సమయానికి సేకరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



పాక్స్ వ్యాక్సినేషన్ డ్రైవ్ అమలు పరిస్థితి, పశువులను వ్యాధుల నుండి రక్షించేందుకు టీకాలు వేయాలని ఆదేశించారు. శాంపిల్ సర్వే పురోగతి పశువుల ఆరోగ్య స్థితి మరియు ఉత్పాదకతపై విశ్లేషణ చేశారు.పోల్ట్రీలో బర్డ్ ఫ్లూ (ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా) పరిస్థితులు, వ్యాధి నియంత్రణ చర్యలపై సమీక్షించారు. గ్రామాల్లో మేత, తాగునీరు అందుబాటు వేసవి కాలంలో పశువులకు తగిన మేత, నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా డా. అనోడా కుమారస్వామి మాట్లాడుతూ, పశుగణన డేటా సేకరణ ప్రాముఖ్యత గురించి వివరించారు. లైవ్‌స్టాక్ డేటా ఖచ్చితంగా సేకరించడం ద్వారా పశు సంవర్ధక విధానాల రూపకల్పన మరియు నిధుల కేటాయింపులో సహాయపడుతుందని పేర్కొన్నారు. పోల్ట్రీ రంగంలో బర్డ్ ఫ్లూ విస్తరణను అరికట్టేందుకు అధిక అప్రమత్తత అవసరమని, అనుమానిత కేసులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశం లో మండలం లో అమలవుతున్న వ్యాధి నిరోధక టీకాలు, పశువుల ఆరోగ్య సంరక్షణ, వ్యాధుల నిర్ధారణ వంటి అంశాలలో ప్రొగ్రెస్ ను, ఈ సందర్భంగా వివరించారు. కాళేశ్వరం గ్రామంలో శాశ్వత వెటర్నరీ కేంద్ర నిర్మాణం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపాము. ఈ తనిఖీ, సమీక్ష సమావేశం అనంతరం, డా. జి. వెంకన్న జిల్లా నోడల్ అధికారి, పశువైద్య సిబ్బందికి పశుగణన డేటా సేకరణ కార్యక్రమాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

# తాండూర్ లో ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

**హైదరాబాద్ పెన్ పవర్:**బిఆర్ఎస్ పార్టీ అధినేత,తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా తాండూర్ మండల బిఆర్ఎస్ నాయకులు సోమవారం సేవ జ్యోతి శరణాలయంలో పండ్లు మరియు కేక్ కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పదేండ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని అన్నారు.పదేండ్లలో జరిగిన అభివృద్ధి గడిచిన సంవత్సర కాలంలో చాలా నష్టానికి గురవుతుందని విమర్శించారు.కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని



తెలిపారు.ఈ కార్యక్రమంలో తాండూర్ మండల మాజీ ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్,ప్రజా ప్రతినిధులు గట్టు సంతోష్ కుమార్,బోడ సతీష్,మొగిలి శంకర్,గొర్లపల్లి విజయ్,రవీందర్,క్రిస్టఫర్,జాడి పోషం,రవి,శ్రీను,యువ నాయకులు చింటూ,క్రాంతి కుమార్,లతీఫ్,తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పేరున పూజలు..

## పీఠాధిపతులకు సన్మానం

## వైదిక విద్యార్థుల పుస్తకాల పంపిణీ

**సంగారెడ్డి: పెన్ పవర్:**తెలంగాణ మొట్టమొదటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు 71 వ పుట్టినరోజు సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఝరా సంగం మండలంలోని బర్దిపూర్ దత్తక్షేత్రంలో జహీరాబాద్ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు నామ సుభద్రమ్మ ట్రస్ట్ అధ్యక్షులు నామ స్రవంతి రవికిరణ్ ఆధ్వర్యంలో కెసిఆర్ గోత్రనామాలతో సోమవారం జ్యోతిర్లింగాలకు, దత్తాత్రేయ స్వామి వారికి, రేణుక మాత కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ 1008 అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్ లకు వస్త్రాలు సమర్పించి సన్మానించారు. 100 మంది వైదిక పాఠశాల విద్యార్థులకు రాతపుస్తకాలు పంపిణీ చేశారు. కెసిఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని పీఠాధిపతులు వైదిక పాఠశాల విద్యార్థులు, ఆశీర్వదించారు.

# గ్రీవెన్స్ డే తో బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

## జిల్లా పోలీసు కార్యాలయంలో పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ



**జగిత్యాల, పెన్ పవర్:** గ్రీవెన్స్ డే తో బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారుని కి భరోసా,నమ్మకం కలిగించాలని అన్నారు.బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

# పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచే విధంగా పనిచేయాలి



**జగిత్యాల, పెన్ పవర్:**పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచే విధంగా ప్రతి పోలీస్ పనిచేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ తకి ఉద్దీన్ కి హెడ్ కానిస్టేబుల్ నుండి ఎస్సైగా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు పదోన్నతి చిహ్నం స్టార్ ను అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు. పదోన్నతులు పొందిన మీరు రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమ్ రావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా సౌత్ ఆఫ్రికాలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు



**జోహాన్నెస్‌బర్గ్ పెన్ పవర్:**ప్రియతమ జననేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు సౌత్ ఆఫ్రికాలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం బీఆర్ఎస్ ఎన్నారై సౌత్ ఆఫ్రికా శాఖ అధ్యక్షుడు నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో జరిగింది. సౌత్ ఆఫ్రికాలోని జోహాన్నెస్‌బర్గ్ లో కోర్ కమిటీ సభ్యులు మరియు కమ్యూనిటీ సభ్యుల సమక్షంలో కేక్ కట్ చేశారు. సాయి కిరణ్ నల్ల, అరవింద్ చికోటి, వెంకట్ రావు తాళ్లపల్లి, రాంబాబు తోడుపు నూరి, నామా రాజేశ్, సాయి కిరణ్ వేముల, రవీందర్ నల్లబాపని తదితర సభ్యులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు అందరూ కేసీఆర్ గారు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు

## గ్రామపంచాయతీ భవనాలు తదితర నిర్మాణ పనులను వేగవంతం చేయాలి



**సిద్దిపేట పెన్ పవర్:** గ్రామపంచాయతీ భవనాలు తదితర నిర్మాణ పనులను వేగవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారుకలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నరేగాలో చేపట్టిన సిసి రోడ్లు డ్రైనేజీలు గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడి భవనాలు తదితర నిర్మాణ పనుల ప్రగతి పై మండలాల వారీగా జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గరిమా అగ్రవాల్ తో కలిసి డిఆర్డిఓ మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో మౌలిక వసతుల పెంపుదలకు చేపట్టిన సిసి రోడ్లు, మరుగుదొడ్లు గ్రామపంచాయతీ పవనాలు అంగన్వాడి భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పూర్తయిన నిర్మాణాల ఎంబి రికార్డ్ చేయాలని అన్నారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని వాటిని వెంటనే ప్రారంభించి వారం రోజుల్లోగా నిర్మాణ ప్రగతిని చూపించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ ఈఈ లు శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవి, డిఇలు, అన్ని మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు..

**జయశంకర్ భూపాలపల్లి, పెన్ పవర్:** రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను జయశం కర్ భూపాలపల్లి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని చిట్యాల, మొగుళ్లపల్లి, రేగొండ, భూపాలపల్లి, మహాముత్తారం, మహదేవపూర్ మండాలల్లో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. పటాకలు కాల్చుతూ జై బీఆర్ఎస్ , జై కేసీఆర్, అంటూ నినాదించారు .చిట్యాల మండల కేంద్రంలోని చిట్యాల సివిల్ దవఖానాలో రోగులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన మాజీ జెడ్పిటిసి గొర్రె సాగర్ మాట్లాడారు..రాష్ట్రం కోసం ప్రాణత్యాగానికి సిద్దపడి రాష్ట్రం సాధించారని తెలిపారు. ప్రాంత అభివృద్ధి, అన్నివర్గాలకు సమన్యాయం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. తెలంగాణ ప్రజలు కన్న కలలు సాకారం కావాలంటే రాబోవు రోజుల్లో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాక్షించారు.



భగవంతుడి ఆశీర్వాదంతో నిండు నూరేళ్ళ చల్లగా, ఆయురోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొత్తూరి రాజిరెడ్డి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్ బాబు మండల యూత్ అధ్యక్షులు టౌటం నవీన్ మహిళా అధ్యక్షురాలు ఈర్ల మల్లక్క శ్రీదేవి ఎరుకొండ రాజేందర్ మడికొండ రవీందర్ రావు కట్రేవుల కుమార్ సాద మల్లయ్య నాగరాజు పాండ్రాల విరాస్వామి చిలుముల రమణ చారి దుదిపాల తిరుపతి రెడ్డి పెరుమడ్ల రవీందర్ ఏరుకొండ రఘు వెంకట్ నాయక్ పల్లే శశిధర్ రెడ్డి దామర రాజు రాకేష్ భానోత్ శ్రీనివాస్ నాయక్ పోషాల రాజు నరేష్ మొగిలి కట్టేకొల్ల పెద్ద రాజు సాదా రాజు కుస ప్రశాంత్ కట్కూరి రాజేందర్ అశోక్ ప్రశాంత్ పార్టీ నాయకులు మహిళా నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేస్తూ చర్యలు తీసుకోండి..

**రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:**గంజాయి కేసుల్లో నిందుతులుగా ఉన్న వారిపై నిఘా ఉంచుతూ గంజాయి కిట్లతో తనిఖీలు చేయాలి

వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

జిల్లా పోలీస్ కార్యక్రమంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష జరిపి కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నేరం జరిగిన ఘటనా స్థలపరిశీలన, సాక్ష్యాధారాలు సేకరణ,కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు తీసుకోవలసిన చర్యల పై అధికారులకు సూచనలు చేసిన ఎస్పీ

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక త్రవ్వకలు, రవాణా చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటు అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని, ఇసుక ను అక్రమంగా రవాణాకు పాల్పడే వారిపట్ల సున్నితంగా వ్యవహరించవద్దని అధికారులను



ఆదేశించారు.

జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన గంజాయి కేసులలో నిందుతులుగా ఉన్న వారియొక్క కదలికలు గమనిస్తూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గంజాయి కిట్ల సహాయంతో తనిఖీలు నిర్వహించి తనిఖీల్లో పాజిటివ్ వస్తే కేసులు నమోదు చేస్తూ జిల్లాలో గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని ఆదేశించారు.

లాంటి లాక్స్ వినియోగించుకోవడం ద్వారా చోరీలను అదుపుచేయవచ్చని విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించలని, నేరాల నియంత్రణ కోసం సాంకేతిక పరిజ్ఞానం వినియెగించుకోవాలని అధికారులకు సూచించారు.

అటవీ జంతువులను వేటాడే వారిపై నిఘా కఠినతరం చేయాలని, తరచు జంతువుల వేటకు పాల్పడే వారిపై పిడి యాక్ట్ అమలు చేయాలని తెలిపారు.కుల పంచాయతీ పేరుతో కుల బహిష్కరణకు పాల్పడుతే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని,జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిఐ లు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్సై ఐ లు మారుతి, అశోక్, ప్రశాంత్ రెడ్డి,పృథ్వీందర్ గౌడ్,ప్రేమనందం, ఐటి కోర్ ఎస్సై కిరణ్, డిసిర్బీ ఎస్సై జ్యోతి, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.